సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 1 । జూలై । 2025



..అధికారులపై చర్య తీసుకోవాలి

పత్తి పంట ధ్వంసం చేసిన అటవీ అధికారులపై చర్య తీసుకోవాలంటూ పాల్వంచ ఎఫ్ఆర్ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. 8లో



రైల్వే ఎస్సై భార్య బలవన్మరణం

భర్త, అతడి కుటుంబసభ్యుల వేధింపులు భరించలేక రైల్వే ఎస్సై భార్య జూలూరుపాడులో ఆత్మహత్యకు పాల్పడింది. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలుచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

కొరవడిన చెత్తశుద్ధి !

సాక్షి ఫోకస్

ముందస్తుగా ఇంటిపన్ను చెల్లిస్తే రాయితీ ఇస్తామంటూ ఎర్లీబర్డ్ పథకాలు.. కొత్తగా ఇల్లు కట్టాలంటే అనుమతి పేరుతో ఫీజు వసూళ్లు.. ఇంటిపన్ను, నల్లా పన్ను, లైబ్రరీ సెస్.. ఇలా అనేక పేర్లతో పన్నులు విధిస్తున్న ప్రభుత్వం.. మున్సిపాలిటీల్లో సమస్యలపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. జిల్లాలోని ఏ పట్టణంలో చూసినా ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడం, డ్రెయినేజీల్లో పూడిక తీయక భరించరాని దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల నుంచి తడిచెత్త, పొడిచెత్త సేకరించే వాహనాలు నెలకు ఒకటి, రెండు సార్లు మాత్రమే వస్తున్నాయి. మున్సిపాలిటీల్లో పాలకవర్గాలు లేక పోగా, అధికారులు ఉన్నా పట్టించుకోవడం లేదు. ఇక వర్షాలు ఉధృతమైతే ఈ సమస్య మరింతగా పెరుగుతుందని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై చెత్త, డ్రెయినేజీల్లో సిల్ట్ పేరుకుపోతే దోమలు వృద్ధి చెందుతాయని, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు తప్పవని భయపడుతున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో పేరకుపోయిన సమస్యలపై సాక్షి ఫోకస్..



పాల్వంచ బొల్లేరుగూడెం మైనార్టీ కళాశాల వద్ద చెత్తకుప్ప

పట్టణాల్లో లోపించిన పారిశుద్ధ్యం

- వీధుల్లోకి వస్తే భరించరాని దుర్గంధం
- అస్తవ్యస్త డ్రెయినేజీలతో ప్రజల ఇక్కట్లు
- ఇంటింటి చెత్త సేకరణా అంతంతే
- పన్ను వసూళ్లలో మాత్రం ముందుంటున్న అధికారులు

చెత్త సేకరణ ఊసేలేదు

పాల్వంచ: కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. నిత్యం చెత్త సేకరణకు రావాల్సిన స్వచ్ఛ ఆటోలు వారికి ఒకటి, రెండు సార్లు కూడా రావడం లేదు. దీంతో ఇళ్లలో రోజుల తరబడి చెత్త నిల్వ చేయలేక స్థానికులు వీధుల్లో పడేస్తుండగా కుప్పలుగా పేరుకుపోతోంది. ప్రధాన వీధుల్లో మాత్రమే చెత్త తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది ఇతర కాలనీలవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇక డ్రెయినేజీల్లో మురుగు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. సీతారాం పట్నం, బొల్లేరుగూడెం ఏరియాల్లో డ్రెయినేజీల పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి వాటి ఆనవాళ్లే కనిపించడం లేదు.

డ్రెయినేజీ ఆనవాళ్లే కనిపించడం లేదు



డ్రెయినేజీలకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి వాటి ఆనవాళ్లు కనిపించడం లేదు. వాటిలో మురుగు తొలగించక చాలా నెలలైంది. వర్షాలు పెరిగితే మా ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. సీతారాంపట్నంలోని అన్ని వీధుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పోటు శ్రీనివాసరావు, సీతారాంపట్నం

పేరులోనే మధురం

కొత్తగూడెంఅర్బన్ : కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మధురబస్తీలో పారిశుద్ధ్య సమస్య ప్రజలను పట్టిపీడిస్తోంది. బస్తీమధ్యలో నుంచి ప్రధాన డ్రెయినేజీ ఉండగా స్థానికుల ఇళ్లలో నుంచి కంటే ఎగువ ప్రాంతాల నుంచి మురికి నీరు, చెత్తాచెదారం చేరుతోంది. బస్తీ చివరన ఉన్న కిన్నెరసాని పైపులైన్ ఈ డ్రెయినేజీలో ఉండేది. మున్సిపల్ అధికారులు ఈ పైపులైన్ డమ్మీ చేసి పక్కనే మరో పైపులైన్ ఏర్పాటు చేశారు. అయితే డమ్మీ చేసిన పైపులైన్‌ను డ్రెయినేజీనుంచి తొలగించకపోవడంతో మురికి నీరు, సిల్ట్ ముందుకెళ్లడం లేదు. దీంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని బస్తీ వాసులు అంటున్నారు. బయటకు వెళితే డ్రెయినేజీ నుంచి భరించరాని దుర్గంధం వస్తోందని, కనీసం రెండు రోజులకోసారైనా సిల్ట్ తొలగించాలని కోరుతున్నారు.



మధురబస్తీ వద్ద డ్రెయినేజీలో అడ్డుగా ఉన్న పైపులైన్

పైపులైన్‌ను తొలగించాలి



మధురబస్తీ ప్రధాన డ్రెయినేజీలో అడ్డుగా ఉన్న కిన్నెరసాని పైపులైన్ తొలగించాలి. డ్రెయినేజీలో మురికినీరు పోకుండా అడ్డుగా ఉండడంతో వర్షం వస్తే మురుగంతా ఇళ్లలోకే వస్తోంది. దీనిపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. – అరుణ్, మధురబస్తీ



అశ్వారావుపేట పాత ఆంధ్రాబ్యాంకు రోడ్‌లో పేరుకు పోయిన చెత్త

అంతర్గత వీధులపై పట్టింపేది ?

అశ్వారావుపేట: నూతనంగా మున్సిపాలిటీ హోదా పొందిన అశ్వారావుపేటలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. 100 రోజుల కార్యాచరణ సక్రమంగా అమలుకాక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. బస్టాండ్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో వాణిజ్య చెత్త అధికంగా ఉత్పన్నం అవుతోంది. హోటళ్లు, మాంసం, చేపల దుకాణాలు, ఇతర దుర్వాసన వెదజల్లే వ్యర్థాలు రోడ్లపైనే వేస్తున్నారు. అయితే ప్రధాన రహదారిపై రోజూ చెత్త సేకరిస్తున్న సిబ్బంది అంతర్గత రోడ్లను మాత్రమ పట్టించుకోవడం లేదు. డ్రెయినేజీల్లో పూడికతీత పనులు సైతం సక్రమంగా లేక సిల్ట్ పేరుకుపోతోంది.

చెత్త వాహనాలు ఐదే..



కాళీమాత ఆలయ సమీపంలో ఉన్న చెత్త

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ తూతూ మంత్రంగానే సాగుతోంది. పట్టణంలో 20 వార్డులు ఉండగా, ప్రధాన వార్డుల్లో ఒకటైన సుందరయ్యనగర్‌లో చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయింది. ముఖ్య వీధులకు మాత్రమే వారంలో రెండు సార్లు చెత్త సేకరణ ఆటోలు వస్తున్నాయి. మొత్తం మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాలు ఐదే ఉండగా అవి ఎటూ సరిపోవడం లేదు. గాంధీనగర్‌లోనూ అదే పరిస్థితి. చెత్త సేకరణ వాహనాలు రాక ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ఇక డ్రెయినేజీలను పట్టించుకునే నాథుడే లేడు.

దోమల బారిన పడుతున్నాం



సుందరయ్యనగర్‌లో కొన్ని వార్డుల్లో మాత్రమే రెండు రోజులకోసారి చెత్త బండ్లు వస్తున్నాయి. లోపలి వీధులకు మాత్రం 20 రోజులకోసారి వస్తున్నారు. కాల్వల్లో మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. వాటి బారిన పడితే వ్యాధులు వస్తాయని భయంగా ఉంది.

-లక్ష్మి, సుందరయ్యనగర్

అధ్వానంగా పారిశుద్ధ్యం



ఇల్లెందు సత్యనారాయణపురం వీధిలో పేరుకుపోయిన చెత్త, బురద

ఇల్లెందు : పట్టణంలోని సత్యనారాయణపురం 1, 2 వార్డుల్లో శానిటేషన్ అధ్వానంగా మారింది. కాల్వల్లో చెత్త తొలిగించడం లేదు. నెలల తరబడి పూడిక తీయకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. తద్వారా దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇంటింటా చెత్త సేకరించాల్సిన వాహనాలు 15 రోజులకోసారి కూడా రావడం లేదు. సుదిమళ్ల గ్రామ పంచాయతీ మున్సిపాలిటీలో కలవగా రోడ్లపై పశువులు, గేదెల మలమూత్రాలతో దుర్గంధం వెదజల్లుతోంది.


చెత్త తొలగించక చాలా రోజులైంది..



సత్యనారాయణపురంలో చెత్త తొలగించక, కాల్వలు శుభ్రం చేయక చాలా రోజులైంది. రోడ్లపై పశువుల మల మూత్రాలు తొలిగించక అపరిశుభ్రంగా ఉంటున్నాయి. పేరుకే మున్సిపాలిటీ కానీ, పంచాయతీ తరహాలోనే రోడ్లు, కాల్వల గురించి ఎవరూ పట్టించుకోవటం లేదు. -కందుల వీరారెడ్డి, సత్యనారాయణపురం, ఇల్లెందు

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రతీ దరఖాస్తును పరిశీలించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును నిశితంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ 9వ వార్డులో మసీదుకు వెళ్లే దారిలో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. చర్ల మండలం దోసినపల్లిలో తమకు ఆరెకరాల పొలం ఉందని, తమ పెద్ద సోదరుడు ఒక్కరే పట్టా చేయించుకున్నాడని, తనకు, తన తమ్ముడికి అన్యాయం చేశాడని అంబేద్కర్ నగర్‌కు చెందిన చింతల భాస్కర్‌రావు ఫిర్యాదు చేశాడు.

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా జయలక్ష్మి



బాధ్యతలు స్వీకరిస్తున్న జయలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్ : జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎల్.భాస్కర్ నాయక్ సోమవారం ఉద్యోగ విరమణ చేయగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ జయలక్ష్మి ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆమె ఈ పోస్టులో కొనసాగుతారు. కాగా, ఉద్యోగ విరమణ పొందిన భాస్కర్‌ను సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజకుమార్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధామోహన్, డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ప్రోగ్రామ్ ఆఫీసర్ మధువరణ్, ఏఓ సుకృత తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్‌లో బదిలీలు షురూ

చుంచుపల్లి : ఉమ్మడి జిల్లా సెర్ప్ ఉద్యోగుల్లో బదిలీల సందడి నెలకొంది. మొదట ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది మంది డీపీఎంలకు సోమవారం స్థాన చలనం కలిగించారు. వీరిలో జిల్లా నుంచి ఐదుగురు, ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు ఉన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి బదిలీ అయిన వారికి ఆదిలాబాద్, వికారాబాద్, మెదక్, కొమరంభీం ఆసిఫాబాద్, హైదరాబాద్ సెర్ప్ కార్యాలయాల్లో పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో జిల్లా నుంచి జి.రమాకాంత, సునందన్, నాగజ్యోతి, యాదయ్య, శేఖర్ ఉండగా, ఖమ్మం నుంచి శ్రీనివాస్, అంజనేయులు, లక్ష్మీనారాయణ ఉన్నారు. కాగా, ఏపీడీ, ఏపీఎంలు, ఎంఎస్‌సీసీలు, సీసీలు, అడ్మిన్ అసిస్టెంట్లకు కూడా త్వరలో బదిలీలు కానున్నాయి.

స్వయం ఉపాధితో ఆదర్శం

భద్రాచలం: స్వయం ఉపాధి పొందుతూ, ఆర్థికాభివృద్ధి సాధిస్తూ దేశంలో గిరిజన మహిళలు ఆదర్శనీయంగా నిలుస్తున్నారని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలోని గిరిజన దర్బార్‌కు వచ్చిన ఆయన సమస్యలపై పీఓతో చర్చించారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ యూనిట్ ద్వారా తయారు చేసిన న్యూట్రిషన్ పదార్థాలు అమ్మకాలు జరిపే స్టాల్‌ను సందర్శించారు. మిల్లెట్ బిస్కెట్లు, సబ్బులు, షాంపుల తయారీ, అమ్మకాల వివరాలు తెలుసుకున్నారు. పీఎం మోదీ మన్‌కీ బాత్‌లో భద్రాచలం ఐటీడీఏ గిరిజన మహిళల ప్రస్తావన తెచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, వారిని అభినందించారు. సరసమైన ధరలలో విక్రయించాలని, తగిన మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. గ్రూప్ మహిళలు విజయలక్ష్మి, సమ్మక్క, సున్నం ఈశ్వరి, సున్నం స్వాతి, బేబీ రాణి, జగ్గా కుమారి పాల్గొన్నారు.

‘సీతారామ’తో న్యాయం చేయాలి

- జిల్లా నీరు, భూములతో ప్రాజెక్టు నిర్మాణం
- గోదావరి జలాలు మాత్రం ఖమ్మం జిల్లాకా..
- ‘చలో పూసుగూడెం’లో బీఆర్ఎస్ నేతలు
- పిండప్రదానం చేయకుండా అడ్డుకున్న పోలీసులు



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు, పక్కన నాయకులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ‘పరాయి ప్రాంతం వాడు ద్రోహం చేస్తే తరిమి కొడతామని, ఈ ప్రాంతం వాడు ద్రోహానికి పాల్పడితే వంద అడుగుల గొయ్యి తీసి పాతిపెడతా’మని కాళోజీ చెప్పిన సూక్తికి తగ్గట్టుగా జిల్లాకు అన్యాయం చేయాలని చూస్తే ఇక్కడి కాంగ్రెస్ నేతలను ప్రజలు బొంద పెడతారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ రేగా కాంతారావు అన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు సాగునీరు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ చేపట్టిన ‘కాంగ్రెస్ ప్రభుత్వానికి పిండ ప్రదానం – ఛలో పూసుగూడెం’ లో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీతారామ నీళ్ల ఖమ్మం జిల్లాకు ఇస్తే తమకు సంతోషమేనని, అయితే అంతకంటే ముందు భద్రాద్రి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు న్యాయం జరిగే వరకూ దశల వారీగా పోరాటం కొనసాగుతుందన్నారు. ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లాకు న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులు చేయడం కూడా ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. చంద్రుగొండ మండలంలో చేపట్టే ప్యాకేజీలో రైతులకు పరిహారం ఇవ్వకుండా భూ సేకరణ ప్రయత్నం సరికాదన్నారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..సీతారామ ప్రాజెక్టులో జిల్లాకు నీరు ఇవ్వకుండా ఖమ్మం తరలించుకుపోతున్నారని అన్నారు. జిల్లాకు న్యాయం చేసేవరకూ తమ పోరాటం ఆగదన్నారు.

‘ఇల్లెందు’కు అనుమతి ఇవ్వాలి

సీతారామ ప్రాజెక్టుకు గతంలో ఇల్లెందు నియోజకవర్గంలోని రోళ్లపాడులో శంకుస్థాపన జరిగిందని, అక్కడి నుంచి ప్రాజెక్టును ఇతర ప్రాంతానికి తీసుకెళ్లినా అప్పటి ఎమ్మెల్యే నోరు మెదపలేదని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇల్లెందు కోసం రూ.3,200 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేయించానని, ఆర్థిక శాఖ వద్ద ఫైల్ పరిశీలనలో ఉండగా ప్రభుత్వం మారిందని, దానికి మంజూరు తేవడంలో ప్రస్తుత ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు.. నిరసన కార్యక్రమాలను అణచివేయడంపై కాకుండా ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తి చేయడంపై దృష్టి పెడితే బాగుంటుందని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి సూచించారు.

దమ్మపేట రోడ్డులో ట్రాఫిక్ జామ్

బీఆర్ఎస్ చేపట్టిన నిరసన, పోలీసుల అడ్డగింత, అరెస్టులతో ఉదయం 11:15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాల్వంచ – దమ్మపేట రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. రెండు వైపులా కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. నేతల అరెస్ట్‌తో వారు వచ్చిన వాహనాలు రోడ్డుకు అడ్డంగా ఉండటం, పోలీస్ బారికేడ్లతో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు కొంత సమయం పట్టింది. మరోవైపు పూసుగూడెం పంప్‌హౌస్‌ను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని లోపలికి ఎవరినీ వెళ్లకుండా అడ్డుకున్నారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను మధ్యాహ్నం 12 గంటలకు పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించగా కార్యకర్తలు స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ములకలపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు మోరంపూడి అప్పారావు, తాండ్ర రాంబాబు, శనగపాటి సీతారాములు, పుష్పాల చందర్‌రావు, కొండ్రు సుందర్‌రావు, సున్నం లలిత తదితరులు పాల్గొన్నారు.

తండ్రి పోలీస్ డ్యూటీ.. కూతురు అరెస్ట్

ములకలపల్లి : తండ్రి ములకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఒగ్గెల లక్ష్మణ్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా బీఆర్ఎస్ చేపట్టిన ‘చలో పూసుగూడెం’ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కూతురు పూజను అరెస్ట్ చేసి అదే స్టేషన్‌కు తరలించారు. అయితే విధి నిర్వహణలో భాగంగా అరెస్టయిన కూతురి వివరాలు సేకరిస్తూ రికార్డు చేశారు.

పోలీసుల సేవలు వినియోగించుకోండి

గ్రీవెన్స్‌లో ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: ప్రతీ పౌరుడు పోలీసుల సేవలను ఉపయోగించుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పలువురు తమ సమస్యలు ఎస్పీకి వివరించారు. ఆయా సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఆయా స్టేషన్ల అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషన్ల వారీగా నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సమస్యలు ఉన్నవారు మధ్యవర్తులను సంప్రదించకుండా నేరుగా సమీప పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం

జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురిని ఎస్పీ రోహిత్‌రాజు సన్మానించారు. ఏడూళ్ల బయ్యారం పీఎస్ ఎస్సై మహమ్మద్ షఫీ, భద్రాచలం ట్రాఫిక్ పీఎస్ ఎస్సై సత్యనారాయణ, అశ్వాపురం పీఎస్ హెడ్ కానిస్టేబుల్ చిన్న వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు.



గ్రీవెన్స్‌లో సమస్యలు వింటున్న ఎస్పీ రోహిత్‌రాజు

వెదురు, మునగతో అధిక లాభాలు

కలెక్టర్ జితేష్ వి పాటిల్



కొముురారంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఇల్లెందురూరల్ : వెదురు, మునగ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని కొమరారంలో సోమవారం ఆయన పోడు రైతులతో మాట్లాడారు. పోడు భూముల్లో రైతులు పత్తి, మొక్కజొన్న మాత్రమే సాగు చేస్తూ సరైన ఆదాయం పొందడం లేదని, దీనికి ప్రత్యామ్నాయంగా లాభసాటి పంటలు సాగు చేయాలని చెప్పారు. పోడు భూములు మునగ, వెదురు సాగుకు అనుకూలంగా ఉంటాయని, సాగు చేసే రైతులకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. తమకు పోడు పట్టాలు రాలేదని కొందరు మహిళలు కలెక్టర్ దృష్టికి తేగా దరఖాస్తులన్నీ పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కొమరారంలో ఏఎంసీ సబ్ యార్డ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మొండితోగులో ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేశారు. మొక్కజొన్న, పత్తి పంటలకు రైతులు వినియోగించే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వివరాలు, వాటి ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైటీసీని సందర్శించిన కలెక్టర్.. ఈ కేంద్రానికి అవసరమైన మరమ్మతులు చేసి త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఏడీఏ లాల్‌చంద్, ఎఫ్‌డీఓ కరుణాకరా చారి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంఈఓ ఉమాశంకర్, ఏఓ సతీష్, ఏపీఎం దుర్గారావు పాల్గొన్నారు.

రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ చేయాలి

ఇల్లెందు : అత్యంత ఖరీదైన రూట్ కెనాల్ చికిత్సను ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో అందించాలని, అందుకు అవసరమైన దంత వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం ఆయన ఇల్లెందు ఆస్పత్రిని పరిశీలించి దంత సమస్యలతో రోజుకు ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. బర్త్ వెయిటింగ్ గదులను స్పెషల్ రూంలుగా రీమోడల్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో లోతట్టుగా ఉన్న చోట గ్రావెల్‌తో లెవెల్ చేయాలని సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌కు సూచించారు. శానిటేషన్ సిబ్బంది పని తీరును అభినందించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ఆర్ఎంఓ రాంనివాస్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



పోడుసాగుదారులతో మాట్లాడుతున్న పీఓ, ఎమ్మెల్యే

భద్రాచలం : గిరిజన దర్బార్‌లో వినతులు ఇచ్చే వారి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, ఈ విషయంలో ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఏఓ సున్నం రాంబాబు, గురుకుల ఆర్‌సీఓ అరుణకుమారి, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, అధికారులు భాస్కర్, వేణు, లక్ష్మీనారాయణ, రమేష్, ఆదినారాయణ, హరికృష్ణ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్

దుమ్ముగూడెం : గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ వారి సేవలు అభినందనీయమని పీఓ రాహుల్ అన్నారు. ములకపాడు ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇలాంటి శిబిరాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందుతాయని చెప్పారు. శిబిరం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు మాట్లాడుతూ.. 219 మందికి కంటిచూపు తక్కువగా ఉన్నట్లు గుర్తించామని, అందులో 142 మందిని కేటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ చైతన్య, వైద్యులు, ఆయా సంస్థల బాధులు సూర్యనారాయణ, ఎ.జగదీష్, కమలా రాజశేఖర్, నక్కా వెంకన్న యాదవ్, వి.కామేశ్వరరావు, సిద్ధారెడ్డి, యుగంధర్, బానోత్ రాము, ప్రసాద్, మధు, పి.ప్రజ్ఞ, మధుమోహన్ రెడ్డి, జి.సంజీవరావు, బాలకృష్ణ, ఆర్. కృష్ణవేణి, ఆదినారాయణ పాల్గొన్నారు. కాగా, పెద్ద నల్లబల్లి గ్రామానికి చెందిన 70 మంది పోడు పట్టాలు రాలేదని ఎమ్మెల్యే వెంకట్రావుతో కలిసి పీఓ రాహుల్‌ను కలిశారు.

క్లుప్తంగా

అనుమతి లేకుండా వెళ్లిపోయిన టీచర్

పాఠశాలలో బిక్కు బిక్కుమంటూ గడిపిన విద్యార్థులు



పాఠశాలలో టీచర్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

టేకులపల్లి: మండలంలోని బద్దూతండా పంచాయతీ మద్దిరాలతండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సోమవారం మధ్యాహ్నం తర్వాత అనుమతి లేకుండానే విధుల నుంచి వెళ్లిపోయాడు. సెలవు చీటి పిల్లలకు ఇచ్చి ఎవరైనా వస్తే చూపించండని చెప్పాడు. కాగా, పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ సాయంత్రం వరకు గడిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు కాంప్లెక్స్ హెచ్ఎం నుంచి అనుమతి తీసుకుని వెళ్లాల్సి ఉంది. కానీ అనుమతి తీసుకోకుండానే, కనీస బాధ్యతను మరిచి పిల్లలను వదిలేసి వెళ్లిపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కాంప్లెక్స్ హెచ్ఎం జోగ రవిని వివరణ కోరగా... అనుమతి కోసం తనను సంప్రదించలేదని తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్, బెస్ట్ అవైలబుల్ పేరెంట్స్ అసోసియేషన్ బాధ్యుడు గురుస్వామి రాష్ట్రవ్యాప్తంగా రూ.200కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ఫలితంగా పాఠశాలల యజమాన్యాలు పిల్లలను ఇబ్బంది పెడుతున్న నేపథ్యాన ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

రైల్వే ఎస్సై భార్య బలవన్మరణం

- ఎస్సై సహా కుటుంబీకుల వేధింపులే కారణమని ఆరోపణ
- ఆస్పత్రి మార్చురీ వద్ద భర్త తండ్రికి దేహశుద్ధి



భర్త రాణాప్రతాప్, కూతురితో రాజేశ్వరి (ఫైల్)



దాడిని అడ్డుకుంటున్న పోలీసులు

జూలూరుపాడు/ఖమ్మం క్రైం: భర్త పోలీసు శాఖలో ఎస్సై, బావ కూడా అదే ఉద్యోగం.. మామ సైతం రిటైర్డ్ పోలీసు అధికారి. సమాజంలో ప్రజల కష్టాలు తీర్చే ఉద్యోగుల ఇంటికి కుమార్తెను ఇస్తే బిడ్డ జీవితం బాగుంటుందని భావిస్తే వివాహేతర సంబంధాల పేరిటే కాక రకరకాల కారణాలతో వేధిస్తుండడంతో ఆమె తనువు చాలించింది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రాములుతండాకు చెందిన బానోతు రాణాప్రతాప్‌తో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరానికి చెందిన రాజేశ్వరి(34)కి 2018లో వివాహం జరిగింది. ఆ సమయాన రూ.40 లక్షలతో పాటు, 35 తులాల బంగారం, మరో రూ.4లక్షల విలువైన కానుకలను ఆమె తల్లిదండ్రులు ముట్టజెప్పారు. వీరికి ప్రస్తుతం ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉండగా.. కొన్నాళ్ల నుంచి భర్తతో పాటు అత్తామామలు పుష్పరాణి – చంద్రం, బావ మహేష్ (ఎస్సై, మహబూబాబాద్ వీఆర్) రాజేశ్వరికి వివాహేతర సంబంధం అంటగట్టి వేధిస్తున్నట్లు సమాచారం. కాగా, రాణాప్రతాప్‌కు ఖమ్మం జీఆర్పీ ఎస్సైగా పోస్టింగ్ రావడంతో భార్యాపిల్లలను జూలూరుపాడులోనే ఉంచి రాకపోకలు సాగిస్తున్నాడు. అయితే, కుటుంబీకుల వేధింపులు తాళలేక రాజేశ్వరి జూలూరుపాడులోని అద్దె ఇంట్లో జూన్ 25న పురుగుల మందు తాగగా ఆమె కుటుంబీకులకు సమాచారం ఇచ్చి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం, ఆపై హైదరాబాద్ తరలించగా పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందింది.

మామపై దాడి..

హైదరాబాద్ నుంచి రాజేశ్వరి మృతదేహాన్ని సోమవారం ఉదయం ఖమ్మం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈక్రమాన రాణాప్రతాప్ తండ్రి చంద్రం మార్చురీ వద్దకు రావడంతో తమ బిడ్డ మృతికి కారణమని ఆరోపిస్తూ రాజేశ్వరి కుటుంబీకులు దాడి చేశారు. దీంతో జూలూరుపాడు, ఖమ్మం టూటౌన్ పోలీసులు అడ్డుకుని ఆయనను టూటౌన్‌కు తరలించారు. ఘటనపై మృతురాలు తండ్రి సోమ్లా ఫిర్యాదుతో రాణాప్రతాప్, పుష్పరాణి, చంద్రం, మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు జూలూరుపాడు ఎస్ఐ రవి తెలిపారు. కాగా, రాణాప్రతాప్, ఆయన సోదరుడు మహేష్ మొదటి నుంచీ వివాదాస్పదులుగానే ఉన్నారు. ఖమ్మం పాత బస్టాండ్ సమీపాన ఓ చెప్పుల షాపు యజమానిపై కొన్నాళ్ల క్రితం అకారణంగా దాడి చేసిన రాణాప్రతాప్ తుపాకీతో బెదిరించాడు. ప్రస్తుతం ఆయన భార్య ఆత్మహత్య చేసుకోవడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

ఇద్దరికి జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: రామవరం గరీబ్‌పేటకు చెందిన వివాహిత చెన్ను త్రివేణి ఆత్మహత్యకు కారకులైన ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కొత్తగూడెం కర్నాటి కవిత సోమవారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు.. త్రివేణికి ఇంటి పక్కనే ఉండే బంధువుల ద్వారా కూసుమంచి మండలం నాయకులగూడేనికి చెందిన ఎల్లబోయిన రామకృష్ణ, జాల శ్రీశైలం పరిచయమయ్యారు. ఈ క్రమంలో వివాహిత అయినప్పటికీ తాను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రామకృష్ణ ఆమెను నాయకులగూడెం తీసుకెళ్లాడు. అనంతరం ఖమ్మం బస్టాండ్‌లో వదిలి వెళ్లిపోయాడు. దీంతో ఎటు వెళ్లాలో తెలియక ఆమె అశ్వాపురంలోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడ పెద్దమ్మ కూడా లేకపోవడంతో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 31.10.2014న మృతి చెందింది. మరణ వాంగ్మూలం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఎల్లబోయిన రామకృష్ణ, జాల శ్రీశైలంపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 24 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఏపీపీ కె.రాజారావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

ములకలపల్లి: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి సోమవారం మండలకేంద్రంతోపాటు మాధారం, జగన్నాథపురం, పాతగంగారం, సీతాయిగూడెం, కమలాపురం, చాపరాలపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో సోమవారం విస్తృతంగా పర్యటించారు. రూ 2.68 కోట్లతో నిర్మించిన కార్యాలయ భవనాలు, సీసీ రోడ్లను ప్రారంభించారు. అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కారం సుధీర్, శనగపాటి అంజి, నాగళ్ల వెంకటేశ్వరరావు, గాడి తిరుపతి రెడ్డి, గుంపుల రవితేజ, సురభి రాజేశ్, పాలకుర్తి సుమిత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మిక శ్రేయస్సుకు నిరంతరం కృషి

జీఎం వీసం కృష్ణయ్య



కళ్లం కోటిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కుటుంబ సభ్యులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా సింగరేణి ఉద్యోగి, ఐఎన్‌టీయూసీ నాయకుడు కళ్లం కోటిరెడ్డి నిరంతరం సింగరేణి అభివృద్ధి, కార్మిక శ్రేయస్సు కోసం పాటుపడ్డారని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం ఇల్లెందు జేకే ఓసీలో ఉద్యోగ విరమణ పొందిన ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కోటిరెడ్డి హక్కుల సాధనకు కృషి చేశాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు జాకీర్ హుస్సేన్, చిన్నయ్య, నాయకులు లచ్చిరామ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేకే సీఈఆర్ క్లబ్‌లో గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ మడత రమా వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగంలో చేరిన నాటి నుంచి నేటివరకు ఇల్లెందు ప్రజలకు, కార్మికులకు ఎంతో సేవ చేశారని పేర్కొన్నారు. అనంతరం కళ్లం కోటిరెడ్డి మాట్లాడుతూ 42 ఏళ్ల పాటు ఇల్లెందు ఏరియాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన తాను ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని, కార్మికుల సంక్షేమం, సింగరేణి అభివృద్ధికి పాటుపడ్డానని తెలిపారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, మడత వెంకట్ గౌడ్‌ల సారథ్యంలో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ జనరల్ త్యాగరాజ్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్లపల్లి అనసూర్య, మాజీ వైస్ చైర్మన్‌లు మడత వెంకట్‌గౌడ్, బాస శ్రీనివాసరావు, సయ్యద్ జానీపాషా, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అబ్దుల్ నబీ, నాయి ని రాజు, ఎస్‌కె జానీ, డానియేల్, పులి సైదులు, కార్మిక నాయకులు జే. వెంకటేశ్వర్లు, కె సారయ్య, నజీర్ అహ్మద్, ఎస్ రంగనాథ్, దిండిగాల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, పత్తి స్వప్న, ఇమామ్, కుటుంబ సభ్యులు కళ్లం అమరనాథ్, శాలినీ రెడ్డి, మురళీరెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ : డ్రైవర్లకు గాయాలు

బూర్గంపాడు: సారపాక పుష్కరవనం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు గాయాలపాలయ్యారు. రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారమందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని లారీ కేబిన్లలో ఇరుక్కుపోయి గాయాలైన డ్రైవర్లను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. లారీలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన ఇట్టి అలివేలు

పాల్వంచరూరల్: భూ వివాదం కారణంగా ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బంద్రుగొండ గ్రామంలో సాగుచేసిన జామాయిల్ కర్రను సోమవారం నరుకుతుండగా.. నరకవద్దని గ్రామానికి చెందిన ఇట్టి అలివేలు కోరింది. అయినా నరుకుతుండటంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయింది. దీంతో స్థానికులు, బంధువులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కొత్తగూడెం, ఆ తర్వాత వరంగల్‌కు తరలించారు.

ఎస్ఐ బెదిరింపుల వల్లే : సీపీఎం

రూరల్ ఎస్ఐ బెదిరింపుల వల్లే అలివేలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని సీపీఎం నాయకుడు కె.వెంకటేశ్వర్లు ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంద్రుగొండ గ్రామంలోని సర్వేనంబర్ 135లో ఆరెకరాల భూమికి సంబంధించిన వివాదంపై ఇటీవల ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయని తెలిపారు. సీపీఐ నాయకుల ఒత్తిడి కారణంగా ఎస్ఐ ఓ వర్గానికి కొమ్ముకాస్తూ దొంగపత్రాలు సృష్టించిన వారికి అండగా ఉండి బాధితులకు అన్యాయం చేస్తుండటంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించిదని పేర్కొన్నారు.

అసత్యపు ఆరోపణలు : ఎస్ఐ సురేష్

నేను ఎవరికీ కొమ్ము కాయడంలేదని, నాపై చేసిన ఆరోపణల్లో నిజంలేదని, ఆధారాలు చూపకుండా అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఉద్యోగులను బలి తీసుకున్న ప్రమాదం

వ్యాన్ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి



రఘుపతి (ఫైల్)



రాజేష్ (ఫైల్)

ఏన్కూరు: రోజు మాదిరిగానే విధులకు వెళ్తున్న ఇద్దరు ఉద్యోగులను రోడ్డు ప్రమాదం పొట్టన పెట్టుకుంది. ఉద్యోగాలకు వెళ్తున్నట్లు కుటుంబీకులకు చెప్పి బయలుదేరగా.. కాసేపటికే ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం అందడంతో విషాదం అలుముకుంది. ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌లో సోమవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కొణిజర్ల మండల పల్లిపాడుకు చెందిన ఇమ్మడి రఘుపతి(51) కొత్తగూడెంలో హోంగార్డుగా, భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం అంకపాలెంకు చెందిన బత్తుల రాజేష్(30) ఖమ్మంలో ఉంటూ కొత్తగూడెం ఎంఈఓ కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ద్విచక్ర వాహనంపై రాజేష్ కొత్తగూడెం వెళ్తుండగా పల్లిపాడు వద్ద రఘుపతి లిఫ్ట్ అడిగి ఆయనతోపాటు బయలుదేరాడు. మార్గమధ్యలో ఏన్కూరు మండలం హిమామ్‌నగర్ సమీపాన వీరి బైక్‌ను జూలూరుపాడు నుండి ఏన్కూరు వైపు వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజేష్, రఘుపతికి తీవ్ర గాయాలు కాగా, 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

బస్సులో వెళ్లినా బతికేవాడేమో...

కొత్తగూడెంలో హోంగార్డుగా పనిచేసే రఘుపతికి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అలాగే, రాజేష్‌కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. రఘుపతి ప్రతీరోజు పల్లిపాడు నుంచి బస్సులో కొత్తగూడెం వెళ్లివచ్చేవాడు. అయితే, సోమవారం విధులకు ఆలస్యమవుతుండడంతో పల్లిపాడు వద్ద రాజేష్‌ను లిఫ్ట్ అడిగి ఆయన బైక్‌పై బయలుదేరాడు. దీంతో గమ్యం చేరకుండానే మార్గమధ్యలో ప్రమాదం బారినపడ్డాడు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

పాల్వంచరూరల్: పత్తి పంటను ధ్వంసం చేసిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రేంజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బంద్రుగొండ గ్రామ శివారు భూమిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, గార్డు, వాచర్లు కలిసి ఎనిమిది ఎకరాల్లో నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్న పత్తి పంటను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, చెన్నయ్య, ఆదినారాయణ, బొమ్మన నారాయణ, బొమ్మన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.